క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోండి



చెరుకుచెర్లలో మంచానికే పరిమితమైన వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

మిడుతూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తలముడిపి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కుటుంబంలోని సభ్యులకు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సాధారణ జబ్బులు, దీర్ఘకాలిక జబ్బులు (బీపీ, షుగర్, గుండె తదితర జబ్బులు) పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంతి, ఏఎన్‌ఎం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి కోరారు. శుక్రవారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సొంత నిధులతో గతంలో కూడా పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు నిరుద్యోగులకు సమాచారమిచ్చి జాబ్‌మేళాను విజయవంతం చేయాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సత్కరిస్తున్న సర్పంచ్ భాగ్యమ్మ

పాములపాడు: గ్రామాభివృద్ధికి సహకరించాలని పాములపాడు సర్పంచు మేకల భాగ్యమ్మ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ గోపీకృష్ణను కోరారు. మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. గ్రామంలోని పలు సమస్యలపై ఎంపీడీఓతో చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు.

దుద్యాలలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా 9వ తేదీన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు కలాం, జాకీర్, శేఖర్, హేమంత్, షేక్షా మంగళవారం తెలిపారు. గడ్డం అహమ్మద్ గారి జ్ఞాపకార్థం జీ.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడా పోటీలను గురు హార్డ్ టెన్నిస్ బాల్‌తో జరుపుతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వారి టీమ్‌ల పేర్లను 8వ తేదీ సాయంత్రం లోపు ప్రవేశరుసుము రూ.500 చెల్లించి నమోదు చేసుకోవాలని వెల్లడించారు. విజేతలకు వరుసగా రూ.20,000, రూ.10,000, ట్రోఫీ అందజేస్తామన్నారు. వివరాలకు 8106492810, 8688160270, 9618626761 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యర్థాలను వాగులో వేయవద్దు



వాగును పరిశీలిస్తున్న కమిషనర్

ఆత్మకూరు: దుకాణదారులు వ్యర్థాలను వాగులో వేయవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పట్టణ శివారులోని గుండ్లకమ్మ వాగును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు, దుకాణదారులు వాగు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వాగును పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

నీటి సమస్య పరిష్కారం

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు బీసీ కాలనీలో బోరు పనిచేయకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. మంగళవారం ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు కాలనీలోని బోరుకు మరమ్మతులు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి అనురాధ తెలిపారు.

నిత్యం.. ట్రాఫిక్ అంతరాయం

- నందికొట్కూరు పట్టణంలో జటిలంగా ట్రాఫిక్ సమస్య
- కార్యరూపం దాల్చని బైపాస్ రోడ్డు నిర్మాణం
- పూర్తికాని రహదారి విస్తరణ
- అవస్థలు పడుతున్న వాహనదారులు



పగిడ్యాల రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలమవుతుంది. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభించలేదు. పట్టణం కేజీ రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ రహదారి పనులు పూర్తి చేయకపోడవంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీనికితోడు పగిడ్యాల, మిడుతూరు రహదారుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు పెరిగిపోవడం వల్ల అక్కడ కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

అటకెక్కిన బైపాస్ రోడ్డు..

శ్రీశైలం, విజయవాడ ప్రధాన రహదారి కావడంతో కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు అనంతపురం, జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజల రాకపోకలతో కేజీ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. పెరిగిన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని 25 ఫిబ్రవరి 2014లో బైపాస్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.16.50 కోట్లతో దాదాపు 6 కిలో మీటర్ల పొడవున పట్టణానికి బయట రహదారి వేసేందుకు శిలాఫలకం వేశారు. అయితే రోడ్డు నిర్మాణానికి అడ్మినిస్ట్రేషన్ మంజూరు వచ్చిందని, టెక్నికల్ మంజూరు మాత్రం రాలేదు. దీంతో బైపాస్ నిర్మాణం అటకెక్కింది.

అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

గత ప్రభుత్వ హయాంలో ప్రాణాళిక లేకుండా 2017 - 18లో కేజీ (కర్నూలు - గుంటూరు) రోడ్డు విస్తరణకు ఉపక్రమించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను పడగొట్టారు. అయితే ఆ తరువాత పరిహారం విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో రహదారి పనులు చేపట్టలేదు. దీంతో కట్టడాలను పడగొట్టినా ఉపయోగం లేకుండా పోయింది. దీనికితోడు పట్టణంలో రహదారులకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలను నిలపడం, తోపుడు బండ్లు ఉంచడం వల్ల కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా పగిడ్యాల, మిడుతూరు రహదారులు ఇరుకుగా ఉండటంతో వల్ల ఈ సమస్యల అధికంగా ఉంది.

హైవేగా కేజీ రోడ్డు..

ఇటీవల ఈ రహదారిని నేషనల్ హైవేలోకి మార్చడం జరిగింది. దీంతో వాహనాల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. హైవేను బైపాస్ కాకుండా పట్టణంలో నుంచి తీసుకెళితే చాలావరకు దుకాణాలు, గృహాలు తొలగించవలసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల పట్టణం రూపురేఖలు మారిపోయి వ్యాపారస్తులు, సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం దాటాలంటే సుమారు 30 నిమిషా సమయం పడుతుంది. వాహనాల పెట్రోల్, డీజల్ వృథా అవుతోంది.పాదచారులు రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి బైపాస్ రోడ్డు వేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

– శివప్రసాద్

రాకపోకలకు ఇబ్బంది



పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ వల్ల వాహనదారులు, కాలి బాట వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఇష్టానుసారంగా వాహనదారులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతుంది. ఆపదలో ఉన్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంది. కనీసం పోలీసులైన స్పందించి ట్రాఫిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తాం. రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నడిపినా, రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలిగే విధంగా ఆపేసిన కేసులు నమోదు చేస్తాం. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా సహకరించాలి.

– విజయభాస్కర్, టౌన్ సీఐ

కుమారస్వామికి విశేషపూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

15న కంటి వైద్య శిబిరం

మహానంది: గాజులపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ నెల 15వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో కంటిశుక్లాలు ఉన్నవారికి ఐఓఎల్ కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని, వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు జిరాక్సు తీసుకుని రావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

నందికొట్కూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టీ.శాలిసాహెబ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని విద్యార్థులు, అధ్యాపకులు పట్టణంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని ఉమ్మడి జిల్లా ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముస్లిం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల అభివృద్ధికి సీఎం వైఎస్ జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం హజ్ యాత్రికులకు రూ. 80 వేలు సబ్సిడీ ఇచ్చిందన్నారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు వేతనాలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ నెల 8వ తేదీన ప్రభుత్వ ఆదేశాల మేరకు, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నాయకత్వంలో పట్టణంలోని ముబారక్ షాదీఖానాలో నియోజకవర్గస్థాయి ముస్లింల సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఇమామ్‌లు, మౌజన్‌లు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్, షేక్ నాయబ్, కో ఆప్షన్ సభ్యుడు గఫార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, ప్రభుత్వ ఖాజీ జలాల్ మౌలాన, ఖాజీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికులకు సబ్సిడీ ఇచ్చిన పత్రం చూపుతున్న ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్

పోరాటాలతో సమస్యల పరిష్కారం

పగిడ్యాల: ఐక్య పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మజీద్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఫకృద్దీన్, కార్యవర్గ సభ్యులు వి. రఘురాంమూర్తి పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యం చేరాలి

మహానంది: వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమ్యం చేరాలని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మహానంది మండలం బోయిలకుంట్ల మెట్ట వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. అలాగే డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు లేని పలు వాహనాలకు రూ.2,700 జరిమానాలు విధించినట్లు చెప్పారు.

ఎస్.కొత్తూరు వృషభాల జయకేతనం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శ్రీసుంకులాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన ఆరు పండ్ల విభాగం బండలాగుడు పోటీల్లో ఎస్.కొత్తూరు వృషభాలు విజయకేతనం ఎగురవేశాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి పూజ చేసి ప్రారంభించారు. పోటీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 14 జతల వృషభాలు పాల్గొన్నాయి. రసవత్తరంగా సాగిన ఈ పోరులో మొదటి విజేతగా నిలిచిన బీరం బుల్స్ ఎస్.కొత్తూరు వృషభాలు నిలిచి రూ.30,000లను కైవసం చేసుకున్నాయి. రెండో విజేత తుమ్మలూరు సురేష్ వృషభాలు రూ.20,000, మూడో విజేత సోమయాజులపల్లె యాగాల నరసయ్య ఎద్దులు రూ.15,000, నాల్గవ విజేత పంచలింగాల బైరపోగు బుల్స్ రూ.10,000, ఐదవ విజేత రంగస్వామి, మాల మూగెన్న కదివెల్ల వృషభాలు రూ.5000, ఆరవ విజేత ఏ కోడూరు చాగంటి నాగేశ్వరరెడ్డి ఎడ్లు రూ.3000 చొప్పున నగదును గెలుపొందాయి. కార్యక్రమంలో ఏట విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, దాతలు పోలయ్య, చంద్రశేఖరరెడ్డి, ఉబేదుర్ రహిమాన్, శ్రీనివాసులు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న దాతలు, నిర్వాహకులు

ఉదారత చాటుకున్న జెడ్పీటీసీ సభ్యుడు

మండలంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ వృషభాలు పోటీలో బండలాగుతుండగా కాడి విరిగింది. ఆ కాడి విలువ రూ.8వేలు, కాగా ఆ రైతు పేదవాడని, ఒంగోలు జాతి పశువులపై ఉన్న ప్రేమతో శక్తి కి మించిన భారంతో వాటి పోషణచేస్తున్నాడని యాంకర్ రామానాయుడు మైకులో అనౌన్స్ చేశారు. స్పందించిన జెడ్పీటీసీ వెంటనే ఆ రైతుకు కాడి కొనుక్కునేందుకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

సర్వేలు త్వరగా పూర్తిచేయండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను గుర్తించేందుకు చేపట్టిన స్కిల్‌హబ్ సర్వే, పేదకుటుంబాలకు ఆర్థిక భరోసా నింపుతున్న వైఎస్సార్ బీమా సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 18 నుంచి 35 సంవత్సరాలలోపు నిరుద్యోగులు ఏవరైనా ఉంటే వారిని వివరాలను సేకరించాలని సూచించారు. వారికి ప్రభుత్వం ఆయా శాఖల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు.

వీపనగండ్లలో ఆర్డీఓ పర్యటన

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం ఆత్మకూరు ఆర్‌డీఓ దాసు, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి పర్యటించారు. గ్రామంలో మే 21న ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు వర్గాల మధ్య రస్తా విషయంలో ఘర్షణ తలెత్తిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణకు పాల్పడిన రెండు వర్గాలకు సంబంధించిన దాదాపు 65 మందిపై ఆర్‌డీఓ కేసు నమోదు చేశారు. ఇరువర్గాలకు సంబంధించిన పెద్ద మనుషులు ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయానికి రావాలని, వారి సమక్షంలోనే సమస్య పరిష్కారానికి చర్చిద్దామని ఇరువర్గాలకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎస్ఐ ఓబులేసు, ఇన్‌చార్జ్ వీఆర్వో రాఘవేంద్ర, పీఎస్ పవన కుమార్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ దాసు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

పాఠశాలలకు 'జగనన్న విద్యాకానుక' కిట్లు

కొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీరాములు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యాసంవత్సరానికి గాను 4వ విడత జగనన్న విద్యాకానుక కిట్లను మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 3,462 మంది విద్యార్థులు ఈ కానుకను పొందనున్నట్లు వెల్లడించారు. 1 నుంచి 5 వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, 6 నుంచి 10 వతరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, బెల్టులు పంపిణీ చేశామన్నారు. వీటితో పాటు డిక్షనరీలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు.



జగనన్న విద్యాకానుకను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిరుద్యోగులకు శిక్షణ

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కాలేజ్ లలో ఏర్పాటైన స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ, ఉపాధి కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. నంద్యాల జిల్లాల్లో 9 స్కిల్ హబ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో శిక్షణ పొందిన వారికి ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. ప్రతి వలంటీర్ కేటాయించిన ఇళ్లల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులను రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్లు మస్తాన్: 8297812530, రమణ: 9154830286, పుల్లారెడ్డి 9573108032 సంప్రదించాలని సూచించారు.

అలరించిన భజన కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై రాజన్న సిరిసిల్లకు చెందిన శ్రీరామలింగేశ్వర భజన మండలి, డి.రాజయ్య వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. వినాయక దేవగణేశ, శివనామమంత్రం, పరమేశ జగదీశ, ఓం నమఃశివాయ, బ్రహ్మమురారి, అమ్మపరమేశ్వరి, శంభో..శివ శంభో, శ్రీశైలం శివమయం తదితర భక్తి గీతాలు, అష్టకాలను యాదగిరి, రజిత, విజయ, నర్సయ్య, సరిత, రమ, గోవిందవ్వ తదితరులు ఆలాపించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో మంగళవారం నుంచి శ్రీసుంకులాపరమేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనము, కంకణధారణ, ఋత్వికరణం, పంచగవ్య, సర్వదేవతావహన, తదితర పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలి

జూపాడుబంగ్లా: చిన్నప్పటి నుంచే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందని సీడీపీఓలు మంగవల్లి, కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామ మాజీ సర్పంచ్ నాగరత్నం, మరియమ్మ దంపతులు గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలమ్మ, సీడీపీఓలు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చిన్నారులకు ఇంటి వద్ద మంచి బుద్ధులు, ఎలా మాట్లాడాలో నేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పెద్దల పట్ల ఎలా నడుచుకోవాలో నేర్పించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పరమేశ్వరరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సామేలు, అంగన్‌వాడి వర్కర్లు అనసూయ, సరస్వతి పాల్గొన్నారు.



పంపిణీ చేసిన నూతన దుస్తులు ధరించిన చిన్నారులతో దాతలు, అధికారులు

పీడీఎస్‌యూలో చేరిక

నందికొట్కూరు: నందికొట్కూరు డివిజన్ పరిధిలోని వామపక్ష విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు షాకీర్ మంగళవారం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ)లో ఆసంగం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎండి రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు సమక్షంలో చేరారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన షాకీర్ విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూలో చేరడం అభినందనీయమన్నారు.

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి



లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న పీడీ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న హౌసింగ్ పనులను గృహనిర్మాణ లబ్ధిదారులు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయభాస్కరనాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు, బిజినవేముల గ్రామాలలోని జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం బిల్లులను సకాలంలో విడుదల చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఏఈ అరుణ్, మండల ఎంపీడీవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరు-1 జగనన్న కాలనీని నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ విజయభాస్కర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. కాలనీలలో సదుపాయాల విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, హౌసింగ్ డీఈ ప్రబాకర్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



చెంచులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణానికి చెందిన 40 చెంచు గిరిజన కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాసులు, ఆంజనేయులు, డాక్టర్ ప్రసన్నలక్ష్మి చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మునిరుద్దీన్, సలీం, అమిరుద్దీన్, మహమ్మద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు ప్రమాదకరం

జూపాడుబంగ్లా: దోమకాటు పాముకంటే ప్రమాదకరమైనదని జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ సభా తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవాలు

వెలుగోడు: మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగేశ్వరరావు, ఆయూష్ సిబ్బంది ఇస్మాయిల్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మహానంది: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వెంకటరెడ్డి తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా మంగళవారం గాజులపల్లెలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో 'పల్లెనిద్ర'

పగిడ్యాల: ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో తరచు గొడవలు పెట్టే వ్యక్తులను గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వెదుర్ల వేలాలతో రూ. 24.20 లక్షల ఆదాయం

మహానంది: మహానంది మండలం గాజులపల్లె రైల్వేస్టేషన్ కలపడిపోలో మంగళవారం నిర్వహించిన వెదుర్ల వేలాల ద్వారా రూ. 24.20లక్షలు ఆదాయం లభించినట్లు నంద్యాల డీఎఫ్ఓ వినీత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 3వేల ఫస్ట్‌క్లాస్ వెదుర్లకు రూ.1.60లక్షలు, సెకండ్ క్లాస్ 40,500 వెదుర్లకు రూ. 14.45.400 వచ్చిందన్నారు. మూడవ తరగతికి చెందిన 45వేల వెదుర్లకు రూ. 81,500 వచ్చినట్లు చెప్పారు. దీంతో మొత్తం రూ.24,20,500 ఆదాయం సమకూరిందన్నారు. దీంతో పాటు టేకు మొద్దుల ద్వారా మరో రూ.10,500 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఈశ్వరయ్య, ఎఫ్ఎస్ఓలు సత్యానారాయణ, ఖాసీం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వేలాలు నిర్వహిస్తున్న నంద్యాల డీఎఫ్ఓ వినీత్‌కుమార్